# సంక్షేమాన్ని చూసి ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి, కుమార్తె ప్రసూన
- గోకవరంలో ఎన్నికల ప్రచారం



గోకవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న తోట శ్రీనిధి, ప్రసూన తదితరులు

**గోకవరం:** గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలని ఆ పార్టీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సతీమణి తోట వాణి, కోడలు శ్రీనిధి, కుమార్తె ప్రసూన అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలో శుక్రవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి స్థానిక డ్రైవర్స్ కాలనీలో గడపగడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. సాయంత్రం స్థానిక టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని కొనసాగించారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తోట నరసింహాన్ని ఎమ్మెల్యేగా, చలమలశెట్టి సునీల్‌ను ఎంపీగా గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, స్థానిక నాయకులు సమ్మెటి నాని, అక్షింతల రాజా, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, ఉనుకూరి ఏసురత్నం, టౌన్ కన్వీనర్ వీర్ల వెంకటేశ్వరరావు, బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), తాటికొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**జగ్గంపేట:** కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం తనయుడు తోట రాంజీ పిలుపునిచ్చారు. మండలంలోని రామవరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రామకుర్తి జగాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా
- తునిలో ఎన్నికల ప్రచారం



తుని 29, 30వ వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా



ఎస్.అన్నవరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

**తుని రూరల్:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రోడ్లు, భవనాలశాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా కోరారు. తుని పట్టణంలోని 29, 30 వార్డుల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకుని ఎన్నికల ప్రచారం చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత సుపరిపాలన అందించడం సీఎం జగన్‌కే సాధ్యమన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలన్నారు. ప్రజలను మోసగించేందుకు వచ్చే పార్టీల నాయకులను నమ్మొద్దన్నారు. 2014–19 మధ్య టీడీపీ పాలనను, 2019–24లో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని సరి చూసుకొని ఓట్లు వేయాలని కోరారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఆయా వార్డుల్లో మంత్రి దాడిశెట్టి రాజాకు అడుగడుగునా ప్రజలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత, 29, 30 వార్డుల కౌన్సిలర్లు దోసపర్తి రాజేశ్వరి, సిదిరెడ్డి గౌరీవనజ, నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సకురు నాగేంద్ర నెహ్రూ, గాంధీ సత్రం, వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్లు అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, అన్నవరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## భారీ మెజార్టీయే లక్ష్యం

**తుని రూరల్:** వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని మంత్రి దాడిశెట్టి రాజా సూచించారు. ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి దాడిశెట్టి రాజా సమక్షంలో ఆ గ్రామానికి చెందిన 70 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి రాజా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లో విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, నాయకులు గారా శ్రీనివాసరావు, కుసునం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ల్యాప్‌టాప్ బహూకరణ



సాయికి వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

**తుని రూరల్:** గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన తిరుమలనీడి సాయికి తుని అలయన్స్ క్లబ్ ప్రతినిధులు ల్యాప్‌టాప్ బహూకరించారు. స్థానిక కొత్తపేటలోని సీతారామ యోగా సెంటర్‌లో శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తుని పట్టణానికి చెందిన తిరుమలనీడి సాయికి రూ.60 వేల విలువ చేసే ల్యాప్‌టాప్‌ను, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు పత్రాన్ని (సర్టిఫికేట్) అందజేశారు. నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించి, చేయూతనివ్వడం అలయన్స్ క్లబ్ బాధ్యతగా భావిస్తున్నట్టు అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ఆర్ ఆంజనేయ ప్రసాద్, గౌరవాధ్యక్షుడు కుచ్చర్లపాటి భీమరాజు, కోశాధికారి దాసరి నూకయ్యశెట్టి, కంకిపాటి రామం, పరవాడ తాతబాబు, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

### టీడీపీకి ఏపూరి రాజీనామా



**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు నియోజకవర్గ బీసీ సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు టీడీపీకి రాజీనామా చేశారు. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఏపూరి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకి పంపినట్టు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారిని కనీసం గుర్తించకపోవడం దురదృష్టకరమన్నారు. టీడీపీలో బీసీ సామాజిక వర్గానికి గుర్తింపు లేదన్నారు. తనపై ఎన్నో కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టినా టీడీపీ నుంచి ఎటువంటి సహాయ సహకారాలు లేవన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశానన్నారు.

### నేటి నుంచి జనచైతన్య యాత్ర

**గోకవరం:** ప్రత్యేక హోదా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శనివారం నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించే జనచైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని శివరామపట్నంలో శుక్రవారం ర్యాలీ, సమావేశం నిర్వహించారు. మే 1 వరకు ఐదు రోజుల పాటు రాజమహేంద్రవరం సిటీ, గోకవరం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, పెద్దాపురం, రంగంపేట, పెదపూడి మండలాల్లో యాత్ర జరుగుతుందన్నారు. ఈ యాత్రలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి రాష్ట్రాల చైర్‌పర్సన్ విమలక్క పాల్గొంటారని చెప్పారు.

## నిరుపేదల అభివృద్ధే లక్ష్యం



శృంగవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- శృంగవరంలో ఎన్నికల ప్రచారం

**రౌతులపూడి:** నిరుపేదల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని శృంగవరంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గ్రామంలో ప్రజలు ఆయనకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పేదలు, రైతులు, అక్కచెల్లెమ్మలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించి ఎన్నికల హామీలను నూరు శాతం అమలు చేశారన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలంటే మరోసారి జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. నాడు–నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేశారన్నారు. ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైద్యారోగ్యశాఖలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఈ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కాకినాడ ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గొల్లు చినదివాణం, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచ్ పి.ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు గాది రాజుబాబు, పార్టీ నాయకులు యామన సురేష్ బాబు, ఎం.వీరబాబు, సర్పంచులు సర్నం శ్రీనివాస్, రాపర్తి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోను ప్రతిగడపకూ తీసుకువెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం
- రాజపూడిలో పార్టీ శ్రేణులతో సమావేశం

**జగ్గంపేట:** ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసే ఎన్నికల మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకువెళ్లేందుకు పార్టీ శ్రేణులు శక్తివంచన లేకుండా కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం సూచించారు. మండలంలోని రాజపూడి రాజీవ్ భవన్‌లో శుక్రవారం రాత్రి నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త అత్తులూరి సాయిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో గెలుపు కోసం పని చేయాలన్నారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అనుసరించాలన్సిన విధివిధాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పాటి శివకుమార్, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ నేతలు బండారు రాజా, గఫూర్, జగాల్, పెద్దాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## పలు నామినేషన్ల తిరస్కరణ

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు అసెంబ్లీ సెగ్మెంట్‌కు దాఖలైన నామినేషన్లను రాజకీయ పార్టీల సమక్షంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. మొత్తం 18 నామినేషన్లు దాఖలు కాగా వాటిలో మూడు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. సమాజ్ వాదీ పార్టీ అభ్యర్థి బత్తిన సింహాచలం అభ్యర్థిత్వాన్ని పది మంది ప్రతిపాదించవలసి ఉండగా తొమ్మిది మంది మాత్రమే ప్రతిపాదించడంతో అతని నామినేషన్‌ను తిరస్కరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు, టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభలకు ప్రత్యామ్నాయంగా దాఖలైన వరుపుల వీరవెంకట సత్య సూరిబాబు, వరుపుల సత్యవతిల నామినేషన్లను తిరస్కరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

**జగ్గంపేటలో రెండు..**

**జగ్గంపేట:** జగ్గంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు దాఖలైన నామినేషన్లను శుక్రవారం అధికారులు స్క్రూటినీ చేశారు. వివిధ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు నామినేషన్ల పరిశీలన చేపట్టారు. నియోజకవర్గంలో మొత్తం 17 నామినేషన్లు దాఖలు కాగా వీటిలో రెండు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. టీడీపీ నుంచి జ్యోతుల నవీన్ కుమార్, వైఎస్సార్ సీపీ నుంచి తోట సరస్వతీ (వాణి) నామినేషన్లు తిరస్కరించినట్టు తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోట నరసింహం, నియోజకవర్గ ఎన్నికల హెడ్ అత్తులూరి సాయిబాబు, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జి గల్లా ఏడుకొండలు, వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

**తునిలో నాలుగు...**

**తుని రూరల్:** సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన పూర్తయింది. తుని అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి నాలుగు నామినేషన్లు తిరష్కరించగా 12 ఆమోదించినట్టు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ కేవీ రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో నామినేషన్ల పరిశీలించామన్నారు. యనమల దివ్య (టీడీపీ), గేలం శ్రీనివాసరావు (కాంగ్రెస్–ఐ), దాడిశెట్టి రాజా (వైఎస్సార్ సీపీ), కర్రి నూకరాజు (బీఎస్పీ), వాడబోయిన శివ (సీపీఐ ఎంఎల్ లిబరేషన్), దుత్తుర్తి సతీష్ (డీబీపీ), యాదాల రామకృష్ణ (ఆర్‌పీఐ), లాలం లోవరాజు (స్వతంత్ర), వేగి ఆది వెంకట సత్యనారాయణ (స్వతంత్ర), బోడపాటి శ్రీనివాసరావు (స్వతంత్ర), కోన రామకృష్ణ (స్వతంత్ర), తమరాన అప్పారావు (స్వతంత్ర) అభ్యర్థుల నామినేషన్ల సక్రమంగా ఉండడంతో ఆమోదించామన్నారు. యనమల నాగేశ్వరరావు, యనమల రామకృష్ణుడు, దాడిశెట్టి లక్ష్మీచైతన్య, శీలం రవీంద్రకుమార్ నామినేషన్లను వేర్వేరు కారణాలతో తిరస్కరించినట్టు చెప్పారు.